నాటిక:

# తేనెతెట్టె

● శ్రీ నోరి నరసింహశాస్త్రి ●

[ పరిచయ వాక్యాలు ]

'మీటరులింకు' ఒక్క నాటకరచయితమాత్రమే కాడు. అతనికి ఇతర సరదాలతో పాటు తేనెటీగలను పెంచడముకూడా ఉండేది. 'తేనెటీగజీవితము' అనే గ్రంథము అతడు వ్రాసినాడు. ఆయన నాటకాలలోవలెనే అందులోకూడా సామాన్యవిషయాలే చెప్పతూ, విశిష్టమైన ఊహలు ధ్వనించేట్లు చేసినాడు. ఆపుస్తకము ఇంగ్లీషుతర్జుమా నేను షుమారు పదిహేనేళ్లకిందట చదివినాను. అందులో తేనెటీగల సంయోగము నామనస్సులో దృఢముగా నాటుకున్నది. భారతీయసంస్కారముతో పెరిగిన నాకు ఆవిషయాలే అలౌకికమైన ఊహలు రేపినవి. అందుకు ఫలితము ఈనాటిక రచన. ఈనాటికకు మూలమైన విషయవర్ణనముతప్ప ఆగ్రంథములోనుంచి ఏమీ గ్రహించలేదు. తేనెటీగలనుగూర్చి వ్రాసిన ఇతరపుస్తకాలలోకూడా ఆవిషయాలే ఉంటవేమో!

ఈనాటిక వ్రాసినతర్వాత ఆగ్రంథము తెప్పించి సందర్భమున్న భాగాలు చదివినాను. నేను చేర్చిన విషయాలు కొన్ని అందులో లేనట్లూ, కొన్ని విరుద్ధంగా ఉన్నట్లూకూడా కనపడింది. ఐనప్పటికీ నాటిక మార్పుచేయడానికి సాహ్యపడక, అట్లాగే ఉంచినాను. ఇది నాటికకాని విషయవర్ణన చేసే శాస్త్రగ్రంథము కాదుకాబట్టి విజ్ఞులు మన్నించగలరు.

తేనెటీగెలు మూడు రకములు. స్త్రీజాతిది తెట్టెకు ఒక్కటే ఉంటుంది. దానికి ఇంగ్లీషుపేరునుబట్టి 'రాణి' అనీ, కొంతస్వాతంత్ర్యముతో 'తల్లి'అనీకూడా వ్యవహరించినాను. సృష్టిభారమంతా దానిదే! ఇక పురుషజాతివి చాలా ఉంటవి. అవి పనిచేయవు. తేనె కూడబెట్టలేవు. 'రాణి'కి గర్భధారణకు కారణముకావడ మొక్కటే వాటి ఉపయోగము. అన్నింటిలో ఒక్కటే అందుకు ఉపయోగపడుతుంది. అదికూడా ఒక్కసారే వాటిని ఇందులో 'పోతులు' అని పుంలింగముగా వ్యవహరించినాను. మిగిలిన తేనెటీగలే తేనెతెట్టెలో పనిఅంతా చేసేవి. వాటికి పుంభావముకాని, స్త్రీభావముకాని లేదు. కాని తేనెతెట్టెఅధికారమంతా నిజముగా వాటిదే. వాటికి అవసరమని తోచినప్పుడే 'రాణి'ని బయటికి రానిస్తవి. వాటికి ఇష్టముంటేనే ముందువచ్చిన రాణి ఇతరరాణులను చంపగలుగుతుంది. 'రాణి'కి గర్భోత్పత్తి ఐ మేఘమండలములోనుంచి నిరపాయముగా తిరిగివచ్చిన తర్వాత, అవి చావక మిగిలిఉన్నపోతుటీగలమీద ఒక్కసారి పడి వాటిని సర్వనాశనము చేస్తవి. తేనెతెట్టెస్థైర్యమూ, వృద్ధీ వాటి ప్రధానలక్ష్యము. అందుకు అవసరమైన విధముగా

అన్నిటినీ ఉపయోగించుకుంటవి. వీటిని ఇందులో సామాన్యముగా 'తేనెటీగలు' అని నపుంసకముగా వ్యవహరించినాను.

రాణి బయటికి రాగానే అది రాణులు కాదగిన గుడ్లనూ, రాణులు అవుతున్న వాటినీ పొడిచి చంపివేస్తుంది. రెండు రాణులు ఒకేపర్యాయము బయటికివస్తే అందులో ఒకటి చనిపోయేదాకా అవి ద్వంద్వయుద్ధము చేస్తవి. తేనెటీగలు తమకు మరొక రాణితో అవసరము ఉంటుం దనుకుంటే తెట్టెలో ఉన్న 'రాణిగుడ్లను' చంపకుండా రాణికి అడ్డము పోతవి. కాని ఈ రెండూ ఈనాటికలో వర్ణితములు కాలేదు.

'రాణి' ఇతర రాణులను చంపిన కొంత కాలానికి ఆకాశములోకి ఎగిరిపోతుంది. వెంటనే ఆ తెట్టెలోనివే కాకుండా, చుట్టుపక్కల అన్ని తెట్టెలలోనివీకూడా పోతుటీగలు దానిని కామోద్రేకముతో వెంబడిస్తవి. రాణిని అందుకోవలెనని ఉద్వేగముతో శక్తి ఉన్నంతవరకూ ఎగిరి అందుకోలేక అందులో ఎన్నో ప్రాణాలు విడుస్తవి. రాణి మేఘ మండలముదాకా ఎగిరిపోతుంది. అంతవరకూ ఎగరగలిగిన పోతుటీగతో దానికి సంయోగ మవుతుంది. ఆసంయోగముతో పోతుటీగ చనిపోతుంది. అంతట రాణి పోతుటీగకళేబర ముతోసహా కిందికి దిగివస్తుంది. ఆపైన సృష్టి ప్రారంభిస్తుంది. ఈనాటికకు మూల మీకథే! కొన్నిరోజులు జరిగే ఈకథ నాటికలో కొన్నిగంటలలోకి కుంచించినాను.

'రాణి'సామాన్యముగా మూడునాలుగుసంవత్సరాలు జీవిస్తుంది. అంతకాలమూ అది తెట్టె విడిచిపోదు. గుడ్లను పెట్టడమే దాని పని. అందుకు దానికి మరల పుంయోగము అవసరము లేదు.

రాజ్యముచేస్తున్న 'రాణి' చనిపోయినసమయములో అరాజకముగా ఉన్న తేనె తెట్టెతో నాటిక ప్రారంభమవుతుంది. ఇందుకు మూలములో ఆధారము లేదు. 'రాణి' రాజ్యముచేస్తుం దనుకోవడముకూడా భ్రమే!

'తీక్ష్ణకామాస్తు గంధర్వాః' అని శ్రీమద్రామాయణములో ఉన్న సంపాతివాక్యము స్మృతిలో ఉన్నందువల్ల ఈనాటికలో తెరలో గంధర్వులచేత పాటలు పాడించినాను.

— నో. న. శా.